# ఎంపీగా గెలిపించండి.. ఐదేండ్లు సేవచేస్తా

**సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్**



హిమాయత్‌నగర్ జరిగిన బైక్ ర్యాలీలో దానం నాగేందర్

**ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఎంపీగా గెలిపిస్తే ఐదేండ్లు సేవ చేస్తానని సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన గంగపుత్ర సంఘం నాయకులు గోవింద్ ఆధ్వర్యంలో దానం నాగేందర్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గోవింద్‌కు దానం నాగేందర్ తలపాగ పెట్టి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని, తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం

**బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం అని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం బర్కత్‌పురలో నిర్వహించిన బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్, ఎన్ఎస్‌యుఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్‌తో కలిసి దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ప్రతి ఒక్కరు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిలీప్‌కుమార్‌నేత, తొలుపునూరి నరేష్‌గౌడ్, జెల్లి శ్రీమంత్‌గిరి, విజయ్‌కుమార్ గౌడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో నిర్వహించిన బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న దానం

### కాంగ్రెస్ విజయం ఖాయం: శ్యామ్‌రావు

**నల్లకుంట, మే 11 (ఆంధ్రజ్యోతి):** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఉమ్మడి ఏపీ సీసీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ జీబీ శ్యామ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్‌లో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను పంపిణీ చేసి హస్తం గుర్తుకు ఓట్లు వేసి దానం నాగేందర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, జే. బీ. రఘు, ఎన్. గిరి, గడ్డం రాఘవేందర్, పాల్గొన్నారు.

### హిమాయత్‌నగర్‌లో రోడ్‌షో

**రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అయిదు గ్యారంటీలు చూసి ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హిమాయత్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. తాను గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడతానన్నారు.

### దానం గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి: బంటారం

**చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా దానం నాగేందర్ గెలిస్తేనే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్ అన్నారు. నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం గాంధీనగర్ డివిజన్‌లో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తా వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ ఓటర్లను కలిసి ఈనెల 13న జరిగే ఎన్నికల్లో చేయి గుర్తుపై ఓటు వేసి దానంను గెలిపించాలని కోరారు. డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, నాయకులు శీలం సత్యనారాయణ, జయేందర్‌బాబు, గుండుజగదీశ్‌బాబు, బాబ్జి, మారిశెట్టి నర్సింగ్‌రావు, చంద్రకళ, జయ, నవీన్‌కుమార్, భూకాల కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తిలక్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న శ్యామ్‌రావు, హరినాథ్‌రెడ్డి, రఘు తదితరులు



దానంకు మద్దతు తెలుపుతున్న గంగపుత్ర సంఘం నాయకులు



పూలుఅమ్మే మహిళను చేయి గుర్తుకు ఓటేయాలని కోరుతున్న యాదగిరిగౌడ్

# బీజేపీని ఆపే శక్తి బీఆర్ఎస్‌కే ఉంది: కేటీఆర్

**ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఇచ్చిన హామీలను విస్మరించడంతో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు అబద్ధాలకు అంబాసిడర్‌లుగా నిలిచారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ ఇద్దరు నేతలు అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం ముషీరాబాద్‌లోని కషిష్ హాల్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఎదుర్కునే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో భయపెట్టి, డబ్బులు ఇచ్చి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కారుగుర్తుకు ఓట్లు వేసి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి):** పద్మారావు గౌడ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రజలను కోరారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లో బైక్‌ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. తెలంగాణ సాధించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేసిన బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి పద్మారావుకు విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్‌పై గులాబీ జెండా ఎగిరితీరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ లక్ష ఓట్లతో విజయం సాధిస్తారని అన్నారు. శనివారం కాచిగూడ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్‌తో కలిసి కాలేరు వెంకటేష్ బైక్ ర్యాలీలో పాల్గొని కాచిగూడ, నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట, గోల్నాక, అంబర్‌పేట డివిజన్ల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.

# సికింద్రాబాద్ బీజేపీకి కంచుకోట: ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

**ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీకి కంచుకోట అని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, పేదల సంక్షేమం ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా మరోసారి మోదీ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో అమలు కానీ హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి విజయం ఖాయమని అన్నారు.



అంబేద్కర్ నగర్‌లో కిషన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

### క్షత్రియులు బీజేపీకి అండగా నిలవాలి

**బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి):** క్షత్రియులు బీజేపీకి అండగా నిలవాలని ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ కోరారు. బర్కత్‌పురలోని ఘన శ్యామ్ పటేల్ భవన్లో అఖిల భారతీయ క్షత్రియ మహాసభ నిర్వహించారు. మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ లక్ష్మణ్ పాల్గొని కిషన్‌రెడ్డి తెలిపించాలని కోరారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓట్ల రాజకీయం చేస్తున్నాయి : పూసరాజు

**ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధికోసం ఓట్ల రాజకీయం చేస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు ఆరోపించారు. శనివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా భోలక్‌పూర్ సంజీవయ్యనగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ డమ్మీ ఈవీఎం ప్యాడ్‌లతో ప్రచారం చేస్తూ బీజేపీకి ఓటు వేసి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



కాచిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కావ్యాకిషన్‌రెడ్డి

### బీజేపీకి ప్రజలు అండగా నిలవాలి: కావ్యాకిషన్‌రెడ్డి

**బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డ, చప్పల్‌బజార్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. అభివృద్ధి, సంక్షేమం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ద్వారానే సాధ్యమని మరోసారి భారీ మెజారిటీ అందించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు.

### కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ ప్రచారం

**కవాడిగూడ, మే 11 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ శనివారం కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

# 144 సెక్షన్ అమలులో ఉంటుంది

- **చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య**

**చిక్కడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి):** చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసిందన్నారు. స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైన్‌షాపులు, బార్‌లు ఈనెల 14వ తేదీ ఉదయం వరకు బంద్ ఉంటాయన్నారు. ఓటర్లను డబ్బులు, మద్యంతో ప్రలోభపెట్టాలని ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై చట్టప్రకారం చర్యలుంటాయని సీతయ్య హెచ్చరించారు. ఈ నెల 13న ఎన్నికల సందర్భంగా పోలింగ్‌స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో వివిధ పార్టీల వారు టేబుళ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి పార్టీ గుర్తులు కూడా పెట్టుకోవద్దని ఆయన హెచ్చరించారు. ఓటర్లు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు తమ సెల్‌ఫోన్‌లు తీసుకుపోవద్దని ఆయన సూచించారు. వికలాంగులు, వృద్ధులకు ట్రైసైకిళ్ళు, వీల్‌చైర్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు.



బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

### బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

**ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి):** బీజేపీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరుతున్నారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పుట్ట రమేష్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్, తుమ్మశ్రీనివాస్ మరో వంద మంది రెండు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు.





అడిక్‌మెట్‌లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, పరుశరామ్



బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా అడిక్‌మెట్‌లో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సూర్యనారాయణశర్మ



దానం నాగేందర్‌కు మద్దతుగా ముషీరాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అరవింద్‌కుమార్‌యాదవ్

# పోటాపోటీగా బైక్ ర్యాలీలు

**రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారం చివరి రోజు కావడంతో ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ. కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా బైక్ ర్యాలీలు నిర్వహించాయి. సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అడిక్‌మెట్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీని డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జిలు వల్లాల శ్రీనివాస్‌యాదవ్. పరుశరామ్‌లు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రవియాదవ్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా అడిక్‌మెట్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ, డివిజన్ అధ్యక్షుడు నరేష్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. డివిజన్‌లోని అన్ని బస్తీలు, కాలనీలలో ఈ ర్యాలీ నిర్వహించి బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు.

సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని డివిజన్లలో బైక్ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, ఎన్నికల ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యప్రసాద్ పాల్గొన్నారు.

### వైన్‌షాపులు బంద్

**ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి):** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 28 వైన్‌షాపులు, 27 బార్‌లు, కల్లుదుకాణాలు శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేశారు. నిబంధనలు అతిక్రమిం మద్యం విక్రయిస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతామని ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.